క్లుప్తంగా

క్రీడాకారులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



దుస్తులు, వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

చింతలమానెపల్లి: క్రీడాకారులు తమకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుల జట్టుకు వాలీబాల్ కిట్లను, క్రీడా దుస్తులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఏఎస్సై యాదవ్, సిబ్బంది దివాకర్, బసార్కర్ కాంత, నాయకులు బల్లారపు రాజన్న, టోంబ్రె శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు సమీక్ష సమావేశం

కెరమెరి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం అధ్యక్షతన జరిగే ఈ సమీక్షలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తగు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

'పది' ప్రత్యేక తరగతులు ప్రారంభం



గోయగాంలో కొనసాగుతున్న తరగతులు

కెరమెరి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు శుక్రవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలకు చెందిన మొత్తం 340 మంది విద్యార్థులకు 143 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దీంతో జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివపంచాయతన, నవగ్రహ సహిత భక్తాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేటి నుంచి రెండు రోజులపాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల జిల్లా అడహక్ కమిటీని జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎస్. సుధాకర్ రెడ్డి (కెరమెరి), కో కన్వీనర్‌గా కె. దేవన్న (వాంకిడి), కోశాధికారిగా మహేశ్ (వాంకిడి), సభ్యులుగా భవాని (దహెగాం), సతీశ్ (ఆసిఫాబాద్), కరుణాకర్ (ఆసిఫాబాద్), కోర్సల్ సింగ్ (ఆసిఫాబాద్), భాగ్యలక్ష్మి(ఆసిఫాబాద్), శంకర్ (రెబ్బెన)లను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

ఆసిఫాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు జిల్లా కేంద్రంలో చేపడుతున్న ఆందోళన శుక్రవారం 33వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు బుద్ధి, కార్యదర్శి రమా సునీత, వినోద్, గణేశ్, కల్పన, శ్రీలత, అర్చన పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి తనిష్క్ ఇటీవల బేస్‌బాల్ అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించిన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో డీఈవో అశోక్, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. అండర్‌ఆర్మ్ క్రికెట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి అజయ్‌ను సైతం సత్కరించారు. కార్యక్రమంలో పీడీ తిరుపతి ఉన్నారు.

విత్తన ఎంపిక కీలకం..!



కోయతలండిలో విత్తన ఎంపికపై అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రవణ్‌కుమార్ (ఫైల్)

రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు పొందాలి. లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాల ఎంపికపై క్షేత్రస్థాయిలో ఏఈ, ఏఈవోలు రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

\- జాడి మిలింద్ కుమార్, ఏడీఏ

- నకిలీ విత్తనాలతో జాగ్రత్త
- అప్రమత్తతే శ్రీరామరక్ష
- తక్కువ ధరను చూసి మోసపోవద్దు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- విత్తనాల ప్యాకెట్‌పై లాట్ నంబర్, కంపెనీ పేరు, డేట్‌ఆఫ్‌ప్యాకింగ్, లేబుల్, విత్తన మొలక శాతం సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి.
- విత్తనాలు కొన్న సమయంలో తప్పనిసరిగా సంబంధిత షాపు నుంచి రశీదు పొందాలి.
- రశీదును ఇంట్లో భద్రపర్చుకోవాలి. తద్వారా పంట నష్టపోయిన సమయంలో పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది.
- దుకాణాల్లో లేదా ప్రైవేట్‌గా నకిలీ విత్తనాలు అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

తిర్యాణి: రైతులు ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్నారు. భూములను దుక్కి దున్నించి విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసి ఉంచారు. సీజన్ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో పలు విత్తన కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్రామాల్లో తిష్ట వేశారు. తమ కంపెనీలకు చెందిన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులను ఒప్పించే పనిలో నిమగ్నమయ్యారు.

అప్రమత్తంగా విత్తన ఎంపిక

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించకుంటే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో వందల సంఖ్యలో నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండి సరైన విత్తనాలు ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. నాణ్యత లేని, పేరు, ఊరు లేని విత్తనాలను రైతులకు అక్రమ వ్యాపారులు అంటగట్టే ప్రమాదం ఉంది. వర్షాలు కురవడం ప్రారంభమైతే రైతులు హడావిడిగా సమీప ఫర్టిలైజర్ షాపుల్లో, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యతలేని విత్తనాలను విక్రయిస్తున్నారు. జాగ్రత్తలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండొచ్చు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు విత్తన ఎంపికపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు అమ్మకుండా ఉండేందుకు తరచూ ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్నారు.

'ఆదర్శ' పిలుస్తోంది!



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్

- జిల్లాలో 320 సీట్లు
- ఈనెల 25 వరకు దరఖాస్తు గడువు
- బాలికలకు హాస్టల్ వసతి

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్‌ను ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తెలంగాణ మోడల్ స్కూళ్లు వరంగా మారాయి. మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఫలితాల్లో జిల్లాలోనే టాప్ ర్యాంక్‌లు సాధిస్తున్నారు. నేషనల్ కం మెరిట్ స్కాలర్‌షిప్, జేఈఈ మెయిన్స్ సీట్లు సైతం కైవసం చేసుకోవడంతో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికల తల్లిదండ్రులు ఆదర్శ పాఠశాలకే మొగ్గు చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఆహ్వానిస్తున్నారు.

ఒక్కో గ్రూపులో 40 సీట్లు..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ) తెలంగాణ ఆదర్శ కళాశాలల్లో ఒక్కో దాంట్లో 160 సీట్లు ఉన్నాయి. వీటిలో సీఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో గ్రూపునకు 40 సీట్ల చొప్పున మొత్తం రెండు కళాశాలల్లో 320 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం విద్యార్థుల ఎంపిక ఉంటుంది. 100 మంది బాలికలకు హాస్టల్ వసతి కల్పించనున్నారు.

రిజర్వేషన్ల వారీగా ఒక్కో గ్రూప్‌లోని సీట్ల వివరాలు..

కేటగిరి	శాతం	సీట్లు	జనరల్	బాలికలు
జనరల్	50	20	13	07
ఎస్సీ	15	06	04	02
ఎస్టీ	06	02	01	01
బీసీ -ఏ	07	03	02	01
బీసీ -బీ	10	04	03	01
బీసీ -సీ	01	00	00	00
బీసీ -డీ	07	03	02	01
బీసీ -ఈ	04	02	02	00

కార్పొరేట్ తరహాలో విద్య



మా పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన కార్పొరేట్ తరహా విద్య అందిస్తున్నాం. చదువుతోపాటు ఇతర రంగాల్లో విద్యార్థులు రాణించేలా కృషి చేస్తున్నాం. ఫలితాల్లో మా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు.

\- అబ్దుల్ ఖలీల్, ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

సీఎం చిత్రపటానికి వీఆర్‌ఏల క్షీరాభిషేకం



కౌటాల: సంబరాలు చేసుకుంటున్న వీఆర్‌ఏలు



బెజ్జూర్: క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

బెజ్జూర్: వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు కామెర ప్రకాశ్ మాట్లాడుతూ వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేసే జీవోను త్వరగా జారీ చేయాలని కోరారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు ఎండీ జావిద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి దుర్గం లింగయ్య, మండల సలహాదారు జిమ్మిడే దేవాజి, వీఆర్‌ఏలు సీహెచ్ గణపతి, పి.రంగయ్య, కె. శ్రీనివాస్, ఎస్.సుధాకర్, ఎస్.బాబు, డి.సుధాకర్, డి. లింగయ్య, జె. రాజు ప్రసాద్, కష్టమూర్తి, నాయకులు జావీద్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఆర్‌ఏల మండల అధ్యక్షుడు దుర్గం శ్యాంరావు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు జక్కుల అభిషేక్, గంగారాం, భువనేశ్వర్, జమునదాస్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో వీఆర్‌ఏలు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు మెరుగు బానేశ్, ఉపాధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి గణేశ్, కోశాధికారి లింగమూర్తి తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: గ్రామ రెవెన్యూ సహాయకులను రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, వీఆర్‌ఏలు కమలాకర్, విజయ్, నారాయణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం మండలంలోని వీఆర్‌ఏలు సంబరాలు చేసుకున్నారు. వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని మంత్రివర్గం తీర్మానించడంతో సీఎం కేసీఆర్, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు రేవంజీ, తదితరులు పాల్గొన్నారు.



తిర్యాణిలో..



పెంచికల్‌పేట్‌లో..

కల్వర్టు పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోవాడ్ గ్రామానికి వెళ్లే దారిలోని శిథిలావస్థకు చేరిన కల్వర్టును శుక్రవారం ఎంపీపీ మల్లికార్జున్ పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



ఫలితాలు సాధించిన విద్యార్థులతో నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పొచ్చయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ ఆధ్వర్యంలో ఇంటర్, పది తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పొచ్చయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేశ్, అధ్యాపకులు సంగీత, యశ్వంత్‌రావు, సంఘం నిర్వాహకులు మురళి, ప్రకాశ్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎం గోపాల్

కౌటాల: వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని పౌరసరఫరాల శాఖ డీఎం గోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాండ్‌గాం, వీరవెల్లి, కౌశి, కౌటాల గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. తాలు, తప్ప లేని నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఆయన వెంట సీఈవో రాజు, ఏఈవోలు దుర్గ భవాని, కల్పన, సిబ్బంది శంకర్, భీంరావ్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని నంబాల సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డయాలసిస్ కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలి



యంత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే వైద్యులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా వచ్చిన డయాలసిస్ యంత్రాలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు నిరంతరం ఉండే విధంగా జనరేటర్ అందుబాటులో ఉంచాలని వైద్యుడు శ్రీధర్ బాబును ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా

రెబ్బెన: పర్యావరణ పరిరక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా అన్నారు. బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ఆదేశాల మేరకు జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంధన పొదుపు అంశంపై శుక్రవారం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయాలన్నారు. భావితరాలకు ఉపయోగపడే రీతిలో ఇంధనాన్ని పొదుపు చేయాలని అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడం'



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి –గడపగడపకు బీజేపీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నామానగర్, గొల్లగూడ, సీతానగర్, సోమయ్యగూడెం, బొగుడగూడ, లస్మయ్యగూడెం తదితర గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు అసహనంతో రగిలిపోతున్నారన్నారు. పోలీసులు చలాన్‌లు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధను లాఅండ్ ఆర్డర్ మీద చూపించాలని విమర్శించారు. నాయకులు పుల్ల అశోక్, బికాస్ ఘరామి, కాళిదాస్ మండల్, విలాస్, చన్కపురి గణపతి, ప్రసాద్, తిరుపతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల టాపర్‌కు ప్రతిభా పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న చాత్రిని

రెబ్బెన: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని చాత్రిని శుక్రవారం కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకుంది. జిల్లాలోని ఇంటర్ కళాశాల టాపర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. రెబ్బెన జూనియర్ కళాశాల అధ్యాపకుడు రామారావు కుమార్తె చాత్రిని ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు 959 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. కార్యక్రమంలో డీఐఈవో శ్రీధర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

రెబ్బెన: రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల కోసం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియం ముస్తాబైంది. శనివారం నుంచి ప్రారంభమయ్యే పోటీల కోసం రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సైలు భూమేశ్, రమేశ్‌లు ఏర్పాట్లు పరిశీలించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్సైలను ఆదేశించారు. మూడు రోజుల పాటు కొనసాగే పోటీల్లో మొదటి బహుమతిగా రూ.15,116, రెండో బహుమతి రూ.10,116ల నగదు బహుమతి అందించనున్నారు.

ఉపకార వేతనాలకు ఎంపికైన 'మోడల్' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌కు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభా పరీక్షలో 8వ తరగతికి చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన ఒక్కొక్కరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున మొత్తం రూ.48 వేలు అందిస్తారన్నారు. పీడీ తిరుపతి, చైర్మన్ ప్రేమ్ కుమార్ ఉన్నారు.

ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ఆర్డర్ కాపీలు అందుకుంటున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సిబ్బందిని రెగ్యులర్ చేస్తూ జనవరిలో జీవోను విడుదల చేసింది. ఈనేపథ్యంలో సిబ్బంది శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూనిట్ జిల్లా సహకార అధికారి తారామణి చేతులమీదుగా ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీలు అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఓమాజి, ఒజ్జల వెంకటరమణ, శ్రీనివాస్‌గౌడ్, శేషరావ్ పాల్గొన్నారు.